క్లుప్తంగా

ఆదరణ మినిస్ట్రీస్ సువార్త వేడుకలు ప్రారంభం

నెహ్రూనగర్: ఆదరణ మినిస్ట్రీస్ సువార్త వేడుకలు శుక్రవారం నల్లపాడు రోడ్డులో ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశం, రాష్ట్రం, సుభిక్షంగా ఉండాలని, ప్రతి వ్యక్తి క్రీస్తు మార్గంలో నడవాలని గత 23 ఏళ్లుగా సువార్త మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రిబ్కా తెలియజేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలకు జిల్లాల నుంచి భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు. దైవజనులు బి. జోసఫ్ మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం నిరంతరం ప్రార్థనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్. మనోరంజని, పాస్టర్ మల్లెల రాజు, మినిస్ట్రీస్ సభ్యులు మేరి, స్వప్న పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో ముగిసిన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో గ్రామీణాభివృద్ధిపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న అపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఈడీ ఎస్. నరేంద్రకుమార్ గ్రామీణాభివృద్ధి, ఆహార ధాన్యాల ఉత్పత్తిపై మాట్లాడారు. సదస్సులో 35 మంది అధ్యాపకులు పరిశోధన పత్రాలు సమర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, డిగ్రీ ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, సదస్సు డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్ రవి, డాక్టర్ నాగ నిర్మల, ఇతర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

గణాంక క్విజ్‌లో టీజేపీఎస్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర గణాంక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన క్విజ్ పోటీలో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో క్విజ్ పోటీలో తృతీయస్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందిన విద్యార్థులు ఎస్. శిరీష, కె. మెర్సీ, ఎస్‌కే జాన్‌బీ, ఆర్. శిరీష, వి. శివ దుర్గను అభినందించారు.

గుంటూరు చేరుకున్న రజకుల పాదయాత్ర



నెహ్రూనగర్: రజకుల్ని ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ నేషనల్ ధోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తిరుపతి నుంచి విజయవాడ వరకు చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం గుంటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రజకులు 18 రాష్ట్రాల్లో, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్సీలుగా మరికొన్ని చోట్ల ఎస్టీలుగా కొనసాగుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. గుంటూరుకు పాదయాత్రగా వచ్చిన నాగమల్లేశ్వరరావుకు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ఇతర నాయకులు సంఘీభావం తెలియజేశారు.

బాజీ బాబా దర్గా వద్ద అన్న సంతర్పణ

పెదకాకాని: స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సహకారంతో శుక్రవారం రాత్రి దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్రవ్యాప్తంగా అధికసంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వారిలో కొందరు రాత్రిపూట ప్రాంగణంలోనే నిద్రలు చేసి ఆ తరువాత రోజు ఇళ్లకు వెళతారు. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా భోజనాన్ని ఎమ్మెల్యే పేరిట భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో పేదలంతా సంతోషం

- ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా
- 51వ డివిజన్‌లో సిద్ధం కార్యక్రమానికి స్పందన



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఏ ఒక్కరితో పొత్తులేదని, ఆయన పొత్తు ప్రజలతోనేనని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 51వ డివిజన్ మల్లికార్జునరావుపేట, శ్రీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం 'సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నేతలు ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ సంక్షేమ పాలనలో పేదలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన పాలన చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న తన బిడ్డ నూరిఫాతిమాను గెలిపించాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో సిఫార్సులు, లంచాలు, జన్మభూమి కమిటీ నచ్చిన వారికే పథకాలు వర్తింపచేశారని విమర్శించారు. 2019 నుంచి సీఎం వై.ఎస్.జగన్ పాలనలో కుల, మత, ప్రాంత, పార్టీలు రహితంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో 51వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి చెన్నుపాటి వెంకటరమణ, శ్రీనివాస్, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు కొత్త రూపు

- 35 ఏళ్ల తర్వాత అభివృద్ధి పనులు
- శరవేగంగా ఇన్నర్ రోడ్ల నిర్మాణం
- రూ.12 లక్షలతో మరుగుదొడ్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో రోడ్ల నిర్మాణం

గుంటూరు వెస్ట్: జిల్లా యంత్రాంగానికి అతి కీలక ప్రదేశమైన కలెక్టరేట్, రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయి. గడచిన 35 ఏళ్లలో ఎప్పుడూ ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి జరగలేదని అధికారులు చెబుతున్నారు. కక్షిదారులు కూర్చుని దస్తావేజులు తయారు చేసుకునేందుకు బ్రిటిషు కాలంలో ఏర్పాటు చేసిన భవనాన్ని 2016 లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూల్చేశారు. కొత్తది కట్టిస్తామని చెప్పి, ఆ తర్వాత వదిలేశారు. ముఖ్యంగా ఈ ప్రదేశాలకు ప్రతి రోజూ వందల సంఖ్యలో వాహనాలతో పాటు ప్రజలు వస్తుంటారు. వారికి కూర్చునేందుకు వసతి గానీ, మరుగుదొడ్లు గానీ లేవు. అంతర్గత రోడ్లు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం వస్తే మునిగిపోయి ఉద్యోగులు ఇబ్బంది పడేవారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి చొరవతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో తారు రోడ్లు నిర్మిస్తున్నారు. ఇవి దాదాపుగా పూర్తి కావచ్చాయి. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి చొరవతో రూ.12 లక్షలు వెచ్చించి ఆధునిక మరుగుదొడ్లను ఇప్పటికే ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన ఇన్నర్ రోడ్లతో వాహనచోదకులకు సౌలభ్యంగా ఉంటుంది. అంతేకాదు చిన్న వర్షానికే మునిగిపోయే పరిస్థితి ఉండదు. మూడు దశాబ్దాలకు పైగా నిర్లక్ష్యం నీడలో ఉన్న కలెక్టరేట్ ముస్తాబు, కొత్త రూపుపై ఉద్యోగస్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు వేస్తారని ఊహించలేదు



వర్షాలకు ఇక్కడ నీరు నిలిచిపోయేది. చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం చక్కటి నాణ్యతతో రోడ్లు నిర్మిస్తున్నారు. ఇది మాలాంటి వారికే కాకుండా అందరికీ ఉపయోగం. నాకు తెలిసి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోడ్లు వేయడం ఇదే తొలిసారి. అధికారులకు కృతజ్ఞతలు.

–జుబేర్, స్టాంప్ వెండార్

కక్షిదారులకు ఉపయోగం



రిజిస్ట్రేషన్, కలెక్టరేట్‌లకు వివిధ పనులపై ఎంతో మంది మహిళలు వస్తుంటారు. మరుగుదొడ్లు లేకపోవడం వల్ల వారితోపాటు పాటు ఇక్కడే ఉపాధి పొందే మాకు కూడా ఇబ్బందిగా ఉండేది. ఇటీవల జేసీ మేడమ్ మరుగుదొడ్లు ప్రారంభించారు. దీనికి మా జిల్లా రిజిస్ట్రార్ శైలజ కృషి ఎంతో ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు

– షేక్ ఖాజా, నోటరీ సహాయకుడు.

జీజీహెచ్‌లో రూ. 20 లక్షలతో రేకుల షెడ్డు నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్ : ఆసుపత్రి అవుట్‌పేషెంట్ విభాగం వద్ద రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న రేకుల షెడ్డుకు శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ అయిదువేల మంది ఆసుపత్రికి వస్తున్నట్లు వెల్లడించారు. రోగులు వారి సహాయకుల కోసం ప్రత్యేకంగా షెడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు.

జీజీహెచ్‌కి ప్రింటర్, కుర్చీల బహూకరణ

జీజీహెచ్‌కి ప్రింటర్‌తో పాటు 17 కుర్చీలను వైష్ణవ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పి.చిరంజీవి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ యోగిత, డాక్టర్ సునీత, బయో మెడికల్ ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపు బజరంగ్ సంక్షేమ సంగమం వైద్య శిబిరాలు

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కళ్లజోళ్లు పొందిన మునిపల్లె గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ సంక్షేమ సంగమం సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పెదకాకానిలో నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సేవల్ని ఉచితంగా అందించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో బజరంగ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. పెదకాకానిలో ఆదివారం లూథర్‌గిరి గ్రంథాలయం వద్ద, సోమవారం శివాలయం రోడ్డు లోని బ్రహ్మం గారి ఆలయం వద్ద నేత్ర జ్యోతి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి వారం రోజుల్లో కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియో, గుండె ఆపరేషన్లు, స్టెంట్లు వేయిస్తామని చెప్పారు. దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు, ఉచితంగా త్రిచక్ర వాహనాలు, జైపూర్ కాళ్లు, వెస్ట్రన్ కమోడ్‌లు సమకూరుస్తున్నట్లు వివరించారు.

355 మందికి కళ్లజోళ్లు పంపిణీ

కొరిటిపాడు(గుంటూరు): పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో జనవరి 31వ తేదీన నిర్వహించిన నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో అవసరమైన 355 మందికి శుక్రవారం అంబటి మురళీకృష్ణ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన 355 మందికి కళ్లజోళ్లు అందజేసినట్టు ఆయన వివరించారు.

అడవితక్కెళ్లపాడు, స్వర్ణభారతీ నగర్‌లో బీజేపీ నేతల ప్రచారం

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అడవితక్కెళ్లపాడు, స్వర్ణ భారతీనగర్‌లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగ విఠల్ పర్యటించారు. బీజేపీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి స్థానికులకు వివరిస్తూ పోస్టర్లు అందజేశారు. గ్రామీణాభివృద్ధి కోసం కేంద్రం ఇస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా పల్లెలు అభివృద్ధి చెందుతాయని స్థానికులకు వివరించారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

నగరంపాలెం: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతుల్ని వెంటనే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్స్యూరెన్స్ ద్వారా యాభై శాతం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద ఘటనపై ఈనెల 12న కలెక్టరేట్‌లో జరగనున్న స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, తెలుగు రైతు సంఘం నేత కల్లం రాజశేఖర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతయ్య, పసుపు రైతులు చందు సత్యనారాయణ, గుళ్లపల్లి సుబ్బారావు, మల్లుపెద్ది రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కమిషనర్ కీర్తి చేకూరి



కార్పొరేటర్ నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల్ని సత్వరం పరిష్కరించాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. వార్డుల వారీగా అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్ర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలపాలని అధికారుల్ని ఆదేశించారు.

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్ని కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ తన చాంబర్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులకు సంబంధిన బిల్లుల ఆన్‌లైన్, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యల్ని ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. నగరంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనులపై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని ఇంజినీరింగ్ అధికారులు మరొకసారి పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలోనే ఆయా స్టేజీల ప్రకారం ఎంబుక్‌లో రికార్డ్ చేయించాలని ఏఈలను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజీల్లో వేగంగా రికార్డు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు.

సాంకేతికత వినియోగంతో ఆహారోత్పత్తి పెంపు



రెక్టార్ వరప్రసాదమూర్తిని సన్మానిస్తున్న రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించడం వల్ల ఆహార ఉత్పత్తిని పెంచడం సాధ్యమవుతుందని రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారతదేశ వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక సవాళ్లు, వ్యూహాలు- ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సూచన' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రసంగిస్తూ సాంకేతికత వినియోగం వల్ల ఎక్కువ మంది ప్రజలకు పౌష్టికాహారం అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు. సభకు రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి అధ్యక్షత వహించారు. ఓఎస్‌డీ ఆచార్య సునీత తదితరులు ప్రసంగించారు. సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య మధుబాబు నివేదికను సమర్పించారు.

అగ్రికల్చర్ మార్కెటింగ్ ప్రాధాన్య అంశం

వ్యవసాయ రంగంలో మార్కెటింగ్ అనేది రైతులకు ఎంతో ప్రాధాన్యమైన విషయమని ఎంఏ ఎకనామిక్స్ విద్యార్థిని సుశి వాసంతి అన్నారు. సదస్సులో ఆమె పరిశోధనా పత్రం సమర్పించారు. నిరక్షరాస్యత, అవగాహనా లోపం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలు, పరిస్థితులను రైతులు అవగాహన చేసుకోలేకపోతున్నారని తెలిపారు. ఏపీఎంసీ(అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీలు) ఈ అంశంలో కీలకపాత్ర పోషించాలని ఆమె సూచించారు.

నేడు కనపర్తి ఏసురత్నం సంస్మరణ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహణ కమిటీ సభ్యులు

నెహ్రూనగర్: దళిత ఉద్యమ నేత కనపర్తి ఏసురత్నం సంస్మరణ సభ ఏసీ కాలేజీలోని జేడీ శీలం ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహణ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రాడీపేటలో శుక్రవారం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహణ కమిటీ సభులు మాట్లాడుతూ దళిత ఉద్యమాలపై తన జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు కనపర్తి అని కొనియాడారు. సభలో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, దళిత ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి. కృపాచారి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ సభ్యులు యండ్రపాటి అశోక్‌కుమార్, వేముల సమత ప్రపుల్లోపాధ్యాయ, నరేంద్ర సుధాకర్, చిన్నం డేవిడ్ విలియమ్స్, వీసా జ్ఞానరాజు, రాయపూడి మరియదాసు పాల్గొన్నారు.

మాజీ ప్రధానులు చరణ్‌సింగ్, పీవీలకు భారతరత్నపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం పట్ల రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ హర్షం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని తన నివాసంలో మాట్లాడుతూ దేశ ప్రధానిగా చరణ్‌సింగ్ మహాత్మాగాంధీ స్ఫూర్తితో రైతాంగ సంక్షేమ కోసం కృషి చేశారని తెలిపారు. 1979 అక్టోబర్‌లో గుంటూరులోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభకు హాజరైన ప్రధానమంత్రి చరణ్‌సింగ్ ఉపన్యాసాన్ని తెలుగులోకి అనువదించిన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

ఆర్థిక వ్యవస్థకు వన్నె తెచ్చిన పీవీ

గుంటూరు మెడికల్: భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వన్నె తెచ్చి, దేశాభివృద్ధికి తోడ్పడిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావును భారతరత్నతో గౌరవించడం తెలుగు వారికి గర్వకారణమని బీజేపీ జిల్లా నేతలు పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించడంపై ప్రధాని నరేంద్రమోదీకి, భారత ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, పబ్లిసిటీ అండ్ లిటరేచర్ రాష్ట్ర కన్వీనర్ పాలపాటి రవికుమార్ ఉన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థినికి ట్యాబ్లెట్ వేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, మల్లికార్జునపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్తంగా శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. విద్యార్థుల్లో రక్త హీనత, పోషకాహార లోపంతో పాటు మానసిక ఎదుగుదల లోపాల్ని నివారించడానికి ఈ మాత్రలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.సీతారామయ్య, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాధిపతి, డాక్టర్ ఎస్.హేమకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్.మహాలక్ష్మి, హెల్త్ వలంటీర్ జి.కృష్ణవేణి పాల్గొన్నారు.

రేపు పశువులకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఈనెల 11వ ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వై. వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. హోమియో, ఆయుర్వేద, అల్లోపతి పశువైద్య విధానాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించనున్న శిబిరాన్ని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: యువకుడి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 28 సంవత్సరాల బి.వినయ్‌కుమార్ నాయుడుపేటలో నివాసం ఉంటున్నాడు. మూడు నెలల కిందట హైదరాబాద్‌లో శాప్ కోచింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

యువకుడి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తకాలనీలో నివసించే షేక్ జాన్‌సైదా (27)వ్యక్తి గత కారణాల వల్ల మానసికంగా కుంగిపోయి శుక్రవారం ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. బాలగురవయ్య వికలాంగుల కాలనీలో రేషన్ బియ్యం తరలిస్తుండగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 150 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో మల్లేశ్వరి శ్రీనివాసరావుపేట రేషన్ బియ్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, 150 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.